ప్రజాశక్తి
శనివారం 20 జులై 2024 | 5 | అనంతపురం





బాధ్యతలు చేపడుతున్న ఎస్‌కెయు విసి



జెఎన్‌టియు విసికి శుభాకాంక్షలు చెబుతున్న దృశ్యం

ఎస్‌కెయు, జెఎన్‌టియు వీసీలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - అనంతపురం

ఎస్‌కెయు, జెఎన్‌టియు ఇన్‌ఛార్జి వీసీలు శుక్రవారం తమ బాధ్యతలు స్వీకరించారు. ఉన్నత విద్య ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్ ఉత్తర్వులు మేరకు శ్రీకష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి ఉపకులపతిగా ఎంబీఏ విభాగానికి చెందిన ఆచార్య బి. అనిత బాధ్యతలు స్వీకరించారు. అదే విధంగా జెఎన్‌టియు ఇన్‌ఛార్జి ఉపకులపతిగా ఆచార్య హెచ్.సుదర్శన రావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎస్కేయు వీసీగా నియమితులైన ఆచార్య అనిత విశ్వవిద్యాలయంలో 1989వ సంవత్సరంలో నియమితులయ్యారు. 1998 లో అసోసియేట్ ప్రొఫెసర్‌గాను, 2006 నుండి ప్రొఫెసర్‌గానూ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ సిబ్బంది, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు,బోధన, బోధ నేతర సిబ్బంది, పరిశోధన విద్యార్థులు, అకాడమిక్ కన్సల్టెంట్లు, అన్ని సెక్షన్లకు సంబంధించిన సిబ్బంది ఆచార్య అనితకి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య జి వెంకట నాయుడు, రిజిస్ట్రార్ ఆచార్య ఎంవి. లక్ష్మయ్య, పిఆర్ఒ ఆచార్య కే రామగోపాల్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అనంతపురం జేఎన్టీయూ ఇన్‌ఛార్జి ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య హెచ్.సుదర్శన రావుకు శుక్రవారం అనంతపురం జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆచార్య నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రములో ఉపాధ్యక్షులు ఆచార్య కె.విజయలక్ష్మి, కార్యదర్శి శారదా, జాయింట్ సెక్రటరీ ఎపి.శివకుమార్, ట్రెజరర్ ఆచార్య విష్ణువర్ధన్ రెడ్డి, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ కమ్యూనిస్టుల ఉద్యమాలే స్ఫూర్తి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు



పూర్వ కమ్యూనిస్టుల కుటుంబాల సమ్మేళనంలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి గతంలో కమ్యూనిస్టులు, ఉద్యమకారుల పోరాటాల గడ్డ అని పూర్వ కమ్యూనిస్టుల పోరాటాలను, ఉద్యమాలే స్ఫూర్తి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి విమానాశ్రయం ఎదురుగా గల సిపిఎం కార్మిక కర్షక భవనంలో పూర్వ కమ్యూనిస్టుల కుటుంబాల సమ్మేళన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బడాసుబ్బిరెడ్డి అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రావు హాజరవగా, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ , జిల్లా కార్యదర్శి ఇంతియాజ్, సీనియర్ నాయకులు ఓబులు, ఈఎస్ వెంకటేష్, దిల్షాద్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అమరవీరుల కుటుంబాల సభ్యులతో మాట్లాడి వారిని కలుసుకోవడం ఎంతో ఆనందకరంగా ఉందన్నారు. ఆనాడు అమరవీరుల త్యాగఫలమే ఈనాడు ఎర్రజెండా రెపరెపలాడుతోందని అన్నారు. బ్రిటిష్ కాలంలో కమ్యూనిస్టులను ఎక్కడివారిని అక్కడ ఉద్యమాలు చేయకుండా నడిరోడ్డుపై కాల్చే వారని, లేదా నిర్బంధించే వారని చెప్పారు. అలాంటి తరుణంలో కూడా ప్రాణాలను పణంగా పెట్టి ఉద్యమంలో పాల్గొన్న వారికి జోహార్లు అర్పిస్తున్నామన్నారు. శ్రీ సత్య సాయి జిల్లా గడ్డపై ఎంతోమంది ఉద్యమకారులు పుట్టారని వారిలో ముఖ్యంగా గణేనాయక్, బుక్కపట్నం నాగమ్మ, సి ముత్యాలప్ప, మలసాని గంగులప్ప, కామ్రేడ్ హిమాంసాబ్, ఇలా ఎంతో మంది ఉద్యమ నాయకులకు ఇది పుట్టినిల్లు అని అన్నారు. వీరు ఎలాంటి స్వార్థం లేకుండా ప్రజాసేవకే అంకితమై జీవించారని చెప్పారు. నేటి యువతరానికి ఓబులు, రాంభూపాల్, ఇంతియాజ్ తదితరులు విద్యార్థి నాయకులుగా ఉన్నప్పుడు నుండి ఉద్యమం ముందుకు తీసుకువెళ్లడానికి, కార్మిక, కర్షకులకు అండగా ఉంటూ ఎన్నో పోరాటాలు చేస్తూ నేటి ఉద్యమానికి స్ఫూర్తిదాయకంగా నిలిచారని తెలిపారు. కార్మికులకు, కర్షకులకు న్యాయం జరగాలంటే సిపిఎం అధికారంలోకి రావాలన్నారు. అందుకు పెత్తందారులు, పెట్టుబడి దారి వ్యవస్థ అడ్డుకుంటున్నారని, వారు చేస్తున్న సంస్కరణలకు ఇతర పార్టీలు సైతం వత్తాసు పలుకుతూ రాజకీయాలను డబ్బుతో ముడి పెడుతున్నాయని విమర్శించారు. ఇటీవల సామాన్యుల రక్త మాంసాలు పిండి ఒక పెట్టుబడిదారీ వ్యవస్థకు చెందిన వ్యక్తి తన కొడుకు పెళ్లి కోసం వేలకోట్ల రూపాయలు ఖర్చు చేశారని అది ప్రజాధనమేనని తెలిపారు. కేంద్రంలో బిజెపి విజయం సాధించినా వారి ముఖాల్లో విజయానందం లేదన్నారు. వారు గెలిచిన తక్కువ సీట్లు సాధించి ఓడిన వారితో సమానమేనని తెలిపారు. తక్షణ ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వంతో జత కట్టిన ప్రతి ప్రాంతీయ పార్టీ సైతం మట్టికొట్టుకుపోయిందని కేంద్రం చెప్పిన ప్రతి మాటను విన్నందునే వారికి ఆ గతి పట్టిందని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ల్యాండ్ టైటిలింగ్ యాక్టు, స్మార్ట్ మీటర్లు తదితర అంశాల ద్వారా రైతుల ఆగ్రహానికి గురి అయిందని, దాంతో తెలుగుదేశానికి పట్టం కట్టారని చెప్పారు. నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం ప్రత్యేక హోదా, కడప, విశాఖ ఉక్కు గురించి కేంద్రం వద్ద నోరు తెరచలేదని విమర్శించారు. ప్రాంతీయ పార్టీలు ఓడిపోవడం ఎంత అనివార్యమో కమ్యూనిస్టులు రావడం అంతే అవసరమని తెలిపారు. కమ్యూనిస్టులు ఎప్పుడూ పదవులు కోరేవారు కాదని ప్రజల హక్కులు ఇతరులు హరించకుండా పోరాటాలు చేస్తుంటారని తిరిగి మళ్లీ కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి వస్తే ప్రజలకు మంచి రోజులు వస్తాయని తెలిపారు. అనంతరం సిపిఎం సీనియర్ నాయకులు ఓబులు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం ఆధునిక కాలంలో పెత్తందారీ విధానం నిర్మూలించడం కోసం కమ్యూనిస్టు భావాలతో ఎంతోమంది పోరాటాల్లో ప్రాణాలర్పించారని, మరికొంతమంది జైలు పాలయ్యారని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జడ్పీ శ్రీనివాసులు, జిఎల్ నరసింహులు, లక్ష్మీనారాయణ, జంగాలపల్లి పెద్దన్న, సాంబశివ, ప్రవీణ్, పెనుగొండ పెద్దన్న, హరి, పైపల్లి గంగాధర్, బ్యాల అంజి, సిఐటియు బాబావలి ముత్యాలప్ప, మడకశిర శ్రీదేవి, సోమందేపల్లి శ్రీదేవి, సౌభాగ్య, సిపిఎం నాయకులు, పూర్వ కమ్యూనిస్టుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన ఎస్‌ఎస్ ట్యాంకుల్లోకి తాగునీటి పంపింగ్

కలెక్టర్‌ను ఆదేశించిన ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి - ఉరవకొండ

ఉరవకొండ నియోజకవర్గంలోని ఎస్ఎస్ ట్యాంకుల్లోకి తాగునీటి పంపింగ్‌ను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌ను రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం విజయవాడ నుంచి అనంతపురం జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడారు. గత ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి వల్ల ఉరవకొండ ప్రాంతంలోని ఎస్ఎస్ ట్యాంకులు పూర్తిగా ఎండిపోయాయని, దీంతో తాగునీటి విషయంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని మంత్రి అన్నారు. ఈ నేపథ్యంలో ఈసారి తుంగభద్ర జలాశయానికి ఆశించిన స్థాయిలో నీరు వచ్చాయని దీంతో హెచ్ఎల్సికి తుంగభద్ర జలాలు విడుదలవుతున్న వేళ ఉరవకొండ నియోజకవర్గంలోని నింబగల్లు, విడపనకల్లు, గడేకల్, కొనకొండ్ల గ్రామాల వద్ద ఉన్న ఎస్ఎస్ ట్యాంకులను తుంగభద్ర జలాలతో నింపే ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన చేపట్టేలా ఆర్డబ్ల్యూఎస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలని కలెక్టర్‌కు మంత్రి సూచించారు. తాగునీటి విషయంలో ప్రజలు ఇన్నాళ్లు పడిన ఇబ్బందులను పూర్తిగా తీర్చే చర్యలను వేగవంతం చేయాలని మంత్రి కలెక్టర్‌ను ఆదేశించారు. ఆ దిశగా ఆర్‌డబ్ల్యూఎస్ యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి ట్యాంకులకు, ఫిల్టర్ బెడ్‌లకు నీటి పంపింగ్ చర్యలను తాను స్వయంగా పర్యవేక్షిస్తానని జిల్లా కలెక్టర్ మంత్రికి వివరించారు.

నేషనల్ పార్కుకు పూర్వ వైభవం తీసుకొస్తాం

ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వైసిపి ఐదేళ్లలో సర్వనాశనమైన నగర సమీపంలోని నేషనల్ పార్క్‌కు పూర్వ వైభవం తీసుకొస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఉదయం నేషనల్ పార్క్‌ను సంబంధిత అధికారులతో కలిసి ఆకస్మికంగా పరిశీలించారు. ఇందులో భాగంగా పార్కులోని ప్రతి విభాగాన్ని చూసి ఎందుకు ఇలాంటి పరిస్థితి వచ్చిందని ఆరాతీశారు. కనీసం మరుగుదొడ్లు, నీటి సౌకర్యం కూడా లేకపోవడంపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అధ్వానంగా మారిన నేషనల్ పార్క్ స్థలాలను చూసి ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ హైదరాబాదులోని శిల్పారామానికి మించి ఇక్కడ పరిస్థితి ఉందన్నారు. కేవలం టిడిపి అభివృద్ధి చేసిందన్న ఒకే ఒక కారణంతో వైసిపి నాయకులు నిర్లక్ష్యం చేశారన్నారు. గత ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఎమ్మెల్యే ఇక్కడికి వచ్చి విజిట్ చేసిన పాపాన పోలేదన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసినవన్నీ నాశనం చేశారని విమర్శించారు. త్వరలో సీఎం చంద్రబాబును కలిసి నిధులు తీసుకొచ్చి నేషనల్ పార్కుకు పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కూచిహరి, మాజీ జెడ్పీ ఛైర్మన్ చమన్‌సాబ్ తనయుడు డాక్టర్ ఉమర్, క్లస్టర్ ఇన్‌ఛార్జి డిష్ నాగరాజు, టిడిపి నాయకులు రాయల్ మధు, డాక్టర్ హరిప్రసాద్, లింగమయ్య స్వామి, జోగి రాజేంద్ర, కాటమయ్య, సాదిక్, రహీమ్, దాదాపీర్, ధనమూర్తి, శోభ, శశికళ, కృష్ణమూర్తి, వెంకటేష్, ఆనంద్, అశోక్, ప్రభాకర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయిన్ నిర్మాణం వేగంగా పూర్తి చేయాలి : మేయర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

జాతీయ రహదారి ఏర్పాటులో భాగంగా నిలిచిపోయిన తాత్కాలిక డ్రెయిన్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మేయర్ మహమ్మద్‌వసీం సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈమేరకు శుక్రవారం నగరంలో జరుగుతున్న తాత్కాలిక డ్రెయిన్ పనులను మేయర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న ప్రధాన రహదారి పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయన్నారు. దీంతో ప్రజలు ఇబ్బంది పడకుండా తాత్కాలికంగా కొన్ని పనులను పూర్తి చేయాలని ఆదేశించామన్నారు. ముఖ్యంగా మురుగు కాలువ నీటితో డిఆర్‌డిఎ కార్యాలయానికి వెళ్లే రహదారి చెరువులా మారిందన్నారు. దీంతో మురుగు నీటిలోనే ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించే దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల ఇబ్బందులను గురత్తిం తాత్కాలికంగా పైపులైను పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఇఇ సూర్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఐసిడిఎస్ జిల్లా కార్యాలయంలో ఫిర్యాదుల బాక్సు

ప్రజాశక్తి-అనంతపురం



ఫిర్యాదు బాక్సును ఏర్పాటు చేస్తున్న శ్రీదేవి

కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు లైంగిక వేధింపుల నిరోధానికి చేపట్టిన చర్యల్లో భాగంగా శుక్రవారం నగరంలోని ఐసిడిఎస్ జిల్లా కార్యాలయంలో ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేశారు. ఈబాక్సును ఐసిడిఎస్ పీడీ బిఎన్ శ్రీదేవి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ లైంగిక వేధింపుల నిరోధానికి జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు, పని చేసే ప్రదేశాల్లో ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించిన విషయం తెలిసిందే అన్నారు. ఇందులో భాగంగా ఐసిడిఎస్ కార్యాలయంలో ఫిర్యాదుల బాక్సును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాక్సులో వేసిన ఫిర్యాదులు వేయాలనుకునే వారు ధైర్యంగా తమ సమస్యలను తెలుపుకోవచ్చన్నారు. ఎందుకంటే బాక్సులోని వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సీనియర్ అసిస్టెంట్లు ధనలక్ష్మి, బాబానూరుద్దీన్, ఐసిడిఎస్ డిసిపిఒ మంజునాథ, డివిసి విభాగం సోషల్ కౌన్సెలర్ ఉమాదేవి, ప్రొటెక్షన్ ఆఫీసర్ చంద్రకళ, అవుట్ రీచ్ వర్కర్ వాల్మీకి రమాదేవి, డివిసి విభాగం గీత, ఛైల్డ్‌లైన్ సుహాసిని, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయను : అస్మిత్‌రెడ్డి

ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-తాడిపత్రి



జెసి అస్మిత్‌రెడ్డితో ప్రమాణస్వీకారం చేయిస్తున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి నియోజకవర్గం ప్రజల దయాదాక్షిణ్యలతో ఎమ్మెల్యేగా గెలిచానని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కొనసాగుతానని ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం స్థానిక కౌన్సిల్ హాల్లో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ముందుగా ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి మున్సిపల్ ఎక్స్ అఫిషియల్ సభ్యుడిగా జెసి అస్మిత్‌రెడ్డితో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం 26 అంశాలతో మున్సిపల్ అజెండాను ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అస్మిత్‌రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా కౌన్సిల్ సమావేశానికి హాజరవ్వడం ఆనందంగా ఉందన్నారు. పదేళ్ల క్రితం ఇదే కౌన్సిల్ సమావేశంలో కౌన్సిలర్‌గా పాల్గొన్నారని గుర్తు చేశారు. మున్సిపాలిటీలో తాగునీరు, డ్రెయినేజీ సమస్యలపై సీఎం చంద్రబాబుతో మాట్లాడామన్నారు. ప్రభుత్వం కుదుటపడగానే సమస్యల పరిష్కరిస్తామని సీఎం చెప్పారని తెలిపారు.

గాలి 'వాటా'లకు పితలాటకం



తల పట్టుకుంటున్న గాలిమరల సంస్థ ప్రతినిధులు

సహజ వనరుల దోపిడీకీ పోటీనే..

తెలుగు తమ్ముళ్ల బరితెగింపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

గాలి మరల్లో వాటాలకై ఇద్దరు ముఖ్య నేతల మధ్య పోటాపోటీ కొనసాగుతున్నట్టు గుసగసలు వినిపిస్తున్నాయి. అనంతపురం జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న నియోజకవర్గంలో గాలిమరల వాటా పేచీ కొనసాగుతోంది. అదే విధంగా ఆ నియోజకవర్గంలో సహజ వనరుల దోపిడీ కూడా పోటాపోటీగా సాగుతోంది. గాలి వాటాల కోసం ఇద్దరు ముఖ్య నేతలు పోటీపడుతున్నారు. దీంతో ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి గాలిమరల సంస్థ ప్రతినిధుల్లో నెలకొంది. ఆ నియోజకవర్గం పరిధిలో పెద్దఎత్తున గాలి మరలున్నాయి. సుమారు 150 ఉన్నట్టు సమాచారం. అయితే అందులో 45 వరకు మాత్రమే పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. పనిచేసే వాటి వరకు అక్కడ పనిచేసే సిబ్బందిని స్థానిక నేతలు సిఫారసు చేసిన వారికి ఇవ్వడానికి అవకాశమున్నట్టు సంస్థ ప్రతినిధులు ముఖ్య నేతను ఒకరిని కలిశారు. ఇందులో పలుకుబడిన ఉన్న మరో నేతలకు రెండు భాగాలు, స్థానిక నేతకు ఒక భాగం కింద సూచించారు. అయితే తనకే కావాలని స్థానిక నేత పట్టుబట్టడంతో వారికే ఇవ్వాలని అంగీకరించారు. సరిగ్గా ఇదే సమయంలో మరో నేత తన వాటా కూడా ఇవ్వాల్సి ఉంటుందని సంస్థ నేతలను కోరినట్టు తెలుస్తోంది. దీంతో ఇదేమి పంచాయతీ అని సంస్థ ప్రతినిధులు తల పట్టుకుంటున్నారు. వీరే కాకుండా ఇతర అధికారపార్టీ నేతలు కూడా తమకూ వాటా కావాలని కోరుతున్నట్టు చర్చ నడుస్తోంది. ఇది ఇలాగుంటే మట్టి, ఇసుక తవ్వకాల్లోనూ ఈ నియోజకవర్గంలో నేతల మధ్యపోటీ కొనసాగుతోంది. అనంతపురం జిల్లా సరిహద్దుల్లోనున్న ఒక పెద్ద కొండను తవ్వడానికి కొత్తగా ఎన్నికైక ప్రజాప్రతినిధి సమీప బంధువు ఒకరు ప్రొక్లైన్, ఐదు టిప్పర్లతో వెళ్లారు. అయితే తానేమి తక్కువ అంటూ మరో నాయకుడు కూడా తాను ప్రొక్లైన్, తొమ్మిది టిప్పర్లతో కొండ వద్దకు చేరుకున్నట్టు తెలుస్తోంది. దీంతో ఇద్దరి మధ్య మరో పేచీ కొనసాగింది. ఒకరికొకరు పోటీ పడటంతో ఇద్దరు కూడా తవ్వకుండా మిన్నకున్నారు. ఇలా అధికారపార్టీలో నేతల మధ్య సహజవనరుల దోపిడీపై పోటీ కొనసాగుతోంది. వీరు ఇసుక, మట్టి తవ్వకాలపై కన్నేసారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముందు నుంచి ఈ నియోజకవర్గంలో టిడిపి నాయకుల మధ్య విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. వాటిని సమన్వయపరిచేందుకు కమిటీలు వేసినా ఫలితం లేకపోయింది. ఇటువంటి పరిస్థితుల్లోనూ పార్టీ గెలుపొందింది. గెలిచిన తరువాత కూడా ముఖ్య నాయకులు, కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధి మధ్య విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. వారి తోడ్పాటు లేకుండానే తాను గెలుపొందానని వారి మాటలు వినే పరిస్థితి లేదన్నట్టుగా ప్రజాప్రతినిధి వ్యవహార శైలి ఉంటోందని పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. ఇప్పుడు పనుల విషయంలోనూ నువ్వా..నేనా అన్నట్టుగానే ఆ నియోజకవర్గంలో వ్యవహారం నడుస్తోంది. ఇవి ఇప్పటికి బహిర్గతం కాకపోయినప్పటికీ లోలోపల మాత్రం రెండు గ్రూపుల మధ్య అంతర్గత తగాదాలు కొనసాగుతూ ఉండటం గమనార్హం.

నిధుల కేటాయింపులో పక్షపాతం తగదు

మండల్ మీట్‌లో ఎంపీపీని నిలదీసిన సర్పంచులు

ప్రజాశక్తి-గుత్తి



సమావేశంలో ఎంపీపీని నిలదీస్తున్న సర్పంచులు

మండల పరిషత్ నిధుల కేటాయింపులో ఎంపిపి జి.విశాలాక్షి పక్షపాతం చూపించారని లచ్చానుపల్లి, శ్రీపురం సర్పంచిలు ఎం.గోపాల్, యు.రామలింగమయ్య ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా వివిధ శాఖ అధికారులు గ్రామాల ప్రగతి, ప్రతిపాదనల గురించి వివరిస్తుండగా సర్పంచులు ఎం.గోపాల్, యు.రామలింగమయ్య లేచి తమ గ్రామ పంచాయతీలకు మండల పరిషత్‌కు సంబంధించి ఒక్క రూపాయి నిధులు కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా గ్రామపంచాయతీలకు నిధులు కేటాయించి తమ గ్రామాలకు నిధులు ఎందుకు మంజూరు చేయలేదని ఎంపీపీని నిలదీశారు. తమ గ్రామాల్లో అంతర్గత రహదారులు లేకపోవడంతో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండి మడుగులను తలపిస్తోందన్నారు. ఇప్పటికైనా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బేతాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇతర ప్రాంతాల వైద్యులు ఇచ్చిన ఇంజక్షన్లను రోగులకు వేయడం లేదని ఎంగన్నపల్లి సర్పంచి పి.భరత్‌కుమార్ అన్నారు. రోగులకు ఇంజక్షన్ వేయకపోవడం అన్యాయం అన్నారు. దీంతో వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం తమ ఆసుపత్రిలోని ఇంజక్షన్లు మాత్రమే రోగులకి వేస్తామని, ఇతర వైద్యులు రాసిన ఇంజక్షన్లు వేయమని చెప్పారు. అలాగే పలువురు సభ్యులు వివిధ సమస్యలను సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసులు, తహశీల్దార్ భారతి, ఇఒఆర్‌డి శివాజీరెడ్డి, వైస్ ఎంపిపిలు ఎస్.తిరుపాలమ్మ, నాగేశ్వరమ్మ, ఎంఇఒ బి.రవినాయక్, ఏఓ ముస్తాక్ అహ్మద్, ట్రాన్స్ కో ఎఇ కె.మధుసూదన్‌రావు, ఎంపిటిసిలు ధనుంజయ, జె.నారాయణస్వామి, చిన్నవీరన్నగౌడ్, సర్పంచులు ఎ.వెంకటేష్, కె.రమేష్‌నాయుడు, ఆర్.గురుమస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కుళ్లాయిస్వామి చివరి దర్శనం

ప్రజాశక్తి-నార్పల



కుళ్లాయిస్వామి చివరి దర్శనాన్ని చూపుతున్న అర్చకులు

మండల పరిధిలోని గూగూడులో వెలసిన కుళ్లాయిస్వామి చివరి దర్శనం కన్నుల పండువగా సాగింది. ఈనెల 7నన ప్రారంభమైన కుల్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం రాత్రి చివరి దర్శనంతో ముగిశాయి. స్వామివారి చివరి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. కుళ్లాయిస్వామి చివరి దర్శన చూడగానే భక్తులందరూ 'కుళ్లాయిస్వామి గోవిందా.. గోవిందా,,' అంటూ గోవింద నామస్మరణను చేశారు. కాగా ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించిన పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, అర్చకులు, వాలంటీర్లు, కార్మికులకు ఆలయ కార్యనిర్వాహణాధికారి సాకేతపురం శోభ, ఆలయ ప్రధాన అర్చకులు హుస్సేనప్ప, సర్పంచి రమణకుమారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

అధికారుల వేధింపులతోనే గ్యాంగ్‌మెన్ మృతి

డిఆర్ఎం కార్యాలయం ఎదుట ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-గుంతకల్లు




ఆందోళన చేస్తున్న ఉద్యోగులతో మాట్లాడుతున్న డిఆర్ఎం

ఇంజనీరింగ్ అధికారుల వేధింపులు తట్టుకోలేక బీహార్ రాష్ట్రాన్ని చెందిన గ్యాంగ్‌మెన్ హరిహోం నారాయణ నాలుగు రోజుల క్రితం ఆత్మహత్యకు పాల్పడ్డారని సహచర ఉద్యోగులు ఆరోపించారు. ఈమేరకు శుక్రవారం స్థానిక డిఆర్ఏం కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైల్వే కార్మిక సంఘం నాయకులు మాట్లాడుతూ గ్యాంగ్‌మెన్ నారాయణ నాలుగు రోజులు క్రితం గుంతకల్లు రైల్వే డివిజన్ పరిధిలోని మల్లప్ప రైల్వే గేటు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటే రైల్వే పోలీసులు (జిఆర్‌పి) ఎలాంటి విచారణ చేయకుండా గుర్తుతెలియని వ్యక్తిగా నిర్ధారణ చేసి ఖననం చేయడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. నారాయణగా గుర్తించి సంబంధిత సీనియర్ సెక్షన్ ఇంజనీర్‌ను నిలదీయగా తమకు ఎలాంటి సమాచారం లేదని చెప్పడం నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. అధికారుల వేధింపులతోనే హరిహోం నారాయణ ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఆరోపించారు. వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు డిఆర్ఎం స్పందిస్తూ గ్యాంగ్‌మెన్ హరిహోం నారాయణ మృతిపై సమగ్ర విచారణ చేపట్టి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఉద్యోగులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డివిజన్ కార్యదర్శి ప్రభాకర్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు స్పందన

కళ్యాణదుర్గం : ఎమ్మెల్యే అమ్మిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థులకు నిర్వహిస్తున్న ఉచిత కోచింగ్ స్పందన లభిస్తుంది. స్థానిక మార్కెట్ యార్డులో డీఎస్సీ పరీక్ష రాసే అభ్యర్థులకు ఉత్తమ ఫ్యాకల్టీతో కోచింగ్ ఇప్పిస్తున్నారు. ఇందులో భాగంగానే శుక్రవారం కోచింగ్ తీసుకునేందుకు నియోజకవర్గంలో పాటు వివిధ ప్రాంతాల నుంచి వందలాదిగా అభ్యర్థులు తరలి వస్తున్నారు. కోచింగ్ తీసుకునే అభ్యర్థులకు ఉచిత భోజన సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు. ఉత్తమ ఉపాధ్యాయుడు వివేకానంద పాఠశాలల కరస్పాండెంట్ సంగప్ప కోచింగ్ నిర్వహణ బాధ్యతలు చూసుకుంటున్నారు. అదేవిధంగా అభ్యర్థులకు మెటీరియల్ కూడా అందజేసినట్లు తెలిపారు.


తాడిపత్రి మండలంలో వినతిపత్రం సమర్పిస్తున్న ఎపి వ్యకాసం, రైతుసంఘం నాయకులు

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

వ్యకాసం,ఎపి రైతుసంఘం ఆధ్వర్యంలో వినతులు

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం ఖాతాల్లో జమ చేయాలని ఎపి రైతుసంఘం మండల కార్యదర్శి రాజారామిరెడ్డి డిమాండ్ చేశారు. రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు మేరకు శుక్రవారం మండల పరిధిలోని పెద్దపొలమడ, చిన్న పొలమడ, ఎర్రగుంటపల్లి సచివాలయాల అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల్లో చెప్పిన విధంగా రైతు కౌలు రైతులకు పెట్టుబడి సాయం కింద అందజేయాలని కోరారు. అదేవిధంగా కేరళ తరహా రుణ విమోచన చట్టం చేయాలని, కౌలు రైతులకు రూ.2 లక్షల రుణాలు మాఫీ చేయాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద పొలమడ గ్రామ కమిటీ కార్యదర్శి నరసింహారెడ్డి, నాగరాజు, నీలకంఠ, శ్రీనివాసులు, అనిల్‌కుమార్, ఆదినారాయణ, సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

శింగనమల : పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పెట్టుబడి సాయం అందించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం, రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఎపి వ్యకాసం, రైతుసంఘం, కౌలు రైతుసంఘాల ఆధ్వర్యంలో గ్రామ సచివాలయ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎపి వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి భాస్కర్, మండల కార్యదర్శి సుంకన్న, అధ్యక్షులు రామాంజనేయులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.20వేలు పెట్టుబడి సాయం అందజేయాలన్నారు. అలాగే 2023 ఖరీఫ్, రబీ సీజన్లలో పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులకు బీమా ప్రకటించాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 200 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. 2023 ఖరీఫ్‌లో ప్రకటించిన కరువు మండలాలకు కరువు నివారణ నిధులు విడుదల చేయాలన్నారు. జీవో 22న రద్దు చేసి వ్యవసాయ మోటార్లకు మీటర్ల బిగింపును వెంటనే ఉపసంహరించుకోవాలని, కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రిస్వామి, కుళ్లాయిస్వామి, ఆంజనేయులు, ఓబులేసు, గోపాల్, ఓబులేసు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి కౌలు రైతుసంఘాల ఆధ్వర్యంలో మండలంలోని అమ్మలదిన్నె సచివాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం గౌరవాధ్యక్షులు కుళ్లాయప్ప మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.20వేలు పెట్టుబడి సాయం అందజేయాలని, కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ఉపాధి కూలీలకు పెండింగ్ బిల్లులు చెల్లించడంతోపాటు 200రోజులు పని దినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఎపి వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని గజరాంపల్లి, వంకరాజుకాలవ గ్రామ సచివాలయాల్లో సిపిఎం ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు రైతుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు గత ఖరీఫ్, రబీ సీజన్లలో నష్టపోయిన రైతులకు బీమా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముత్యాలు, బాబా ఫక్రుద్దీన్, శివ, తదితరులు పాల్గొన్నారు.

వజ్రకరూరు : రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రభుత్వం ప్రకటించిన రూ.20వేల ఆర్థికసాయాన్ని ఖాతాల్లో జమ చేయడంతోపాటు 2023లో పంటలు నష్టపోయిన రైతులకు బీమా ప్రకటించాలని కౌలు రైతుసంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఉరవకొండ మండల పరిధిలోని మోపిడి, చిన్నముష్టూరు, నెరమెట్ల, రాయంపల్లి గ్రామ సచివాలయాల్లో కౌలు రైతుసంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు రంగారెడ్డి, ఉపాధ్యక్షులు మధుసూదన్, నాయకులు మురళి, వీరాంజనేయులు, రవికుమార్, ఇంద్రావతి ఓబులేసు, ఎర్రిస్వామి, ప్రసాద్, వెంకటస్వామి, ఎర్రితాత, తిమ్మారెడ్డి, నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : రైతులు, కౌలు రైతులు, ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఏపీ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతుసంఘాల ఆధ్వర్యంలో మండలంలోని కొత్తపేటలో ఉన్న సచివాలయ ఉద్యోగికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు వి.నిర్మల, మద్దిలేటి, వెంకటలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు తక్షణమే ఇవ్వాలన్నారు. వ్యవసాయ రంగానికి ఉచితంగా విద్యుత్తును సరఫరా చేయాలన్నారు. వీటితోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు రామలక్ష్మి, శ్యామల, అలివేలమ్మ, శివ, పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి 'ఆదర్శ' విద్యార్థినులు


ట్రిపుల్ ఐటికి ఎంపికైన విద్యార్థినులు

గుత్తి : పట్టణంలోని ఏపీ ఆదర్శ పాఠశాలలో చదివిన విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ ఏడాది పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీకు ఎంపికయ్యారు. ఏపీ ఆదర్శ పాఠశాలల్లో చదివిన ఎస్.అర్పిత నూజివీడు ట్రిబుల్ ఐటీ కళాశాల, ఎం.పల్లవి, ఎస్. షీమా జైదీ ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ కళాశాలలో ప్రవేశాలు దక్కాయి. వారు ఆయా కళాశాలలో విద్యను అభ్యసించనున్నారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థినులను ఏపీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.ఉష, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అభినందించారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

గుత్తి : మండలంలోని తురకపల్లి గ్రామానికి చెందిన కాయల శివరాజ్‌కు వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సోదరుడు నారాయణ శుక్రవారం ఆర్థిక సాయం చేశారు. శివరాజ్ హార్ట్ ఎటాక్, బ్రెయిన్ స్ట్రోక్‌తో కోమాలోకి వెళ్లడంతో కుటుంబ సభ్యులు అతన్ని కర్నూలులో ఉన్న ఓ ప్రయిటు ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న గుమ్మనూరు నారాయణ వైద్య ఖర్చులకు ఇచ్చిన రూ.10వేలు ఆర్థిక సాయాన్ని గ్రామానికి చెందిన విజయ భరత్‌రెడ్డి, నాగిరెడ్డి, జయపాల్‌రెడ్డి ఆసుపత్రికి వెళ్లి కుటుంబ సభ్యులకు అందజేశారు.

వన మహోత్సవం

పుట్లూరు : వనమహోత్సవం, తల్లి పేరు మీద ఒక చెట్టు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని చెర్లోపల్లి గ్రామ సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పక్కుబి, పంచాయతీ సెక్రటరీ పి.శ్రీనివాసులు, అధికారులు జి.వెంకటరమణ, గయాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన తెలుగు యువత నాయకులు

శింగనమల : అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణను తెలుగు యువత మాజీ జిల్లా కార్యదర్శి కాయల రాజశేఖర్‌యాదవ్ అనంతపురంలోని ఎంపీ నివాసంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా పుష్పగుచ్చం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం శుభాకాంక్షలు తెలిపారు.

సబ్సిడీతో కందులు పంపిణీ

గుంతకల్లు రూరల్ : రైతుల సౌకర్యార్థం సబ్సిడీతో విత్తన కందులు పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారిణి కె.స్వాతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4 కిలోల బ్యాగు ధర రూ.560 కాగా సబ్సిడీతో రూ.392కే ఇస్తున్నట్లు తెలిపారు. విత్తన కందులు కావాల్సిన రైతులు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో తీసుకోవచ్చన్నారు.

23 నుంచి మొబైల్ ఆధార్ కేంద్రాలు

పుట్లూరు : మండల వ్యాప్తంగా ఈనెల 23 నుంచి 27వ తేదీ వరకూ మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపిడిఒ దస్తగిరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23న పుట్లూరు, 24న కుమ్మనమల, 25న కోమటికుంట్ల, 26, 27వ తేదీల్లో కడవకల్లు సచివాలయాల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వజ్రకరూరు : ఆధార్ స్పెషల్ డ్రైవ్‌ను పక్కడ్బందీగా చేపట్టాలని ఉరవకొండ ఎంపిడిఒ సుబ్బరాజు సూచించారు. శుక్రవారం ఉరవకొండ ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల 23 నుంచి 27వతేదీ వరకూ నిర్వహించనున్న ఆధార్ స్పెషల్ క్యాంపపై సచివాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్లు ఎర్రిస్వామి, మస్తాన్, షమీర్, ప్రసన్న , నూర్‌బాషా, నాగవేణి, అహమ్మద్, హనుమంతురెడ్డి, సునీత, పరమేష్, తేజేష్, మహబూబ్ బాషా, రోజా, అనితమ్మ, విజయ్, అమరేష్, సాగర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మణిద్వీప వర్ణన పూజ

పామిడి : పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఆషాడమాసం 2వ శుక్రవారం సందర్భంగా మణిదీప వర్ణన పూజ చేపట్టారు. ఈ సందర్భంగా 9సార్లు 33 పూలతో పూజలు చేశారు. ఇందులో భాగంగా వాసవీ, లలిత అష్టోత్తర పూజలు చేశారు. ప్రాత్ణకాల అభిషేకం, నివేదన, హారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి భక్తులు, తదితరులు పాల్గొన్నారు. కాగా పట్టణంలోని పాండురంగ స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో క్రిష్ణయ్య, నాగభూషణరావు, మంజునాథరావు, మున్నా, తదితరులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య'లో ఎన్నికలపై అవగాహన

అనంతపురం : నగరంలోని కోర్టు రోడ్డులో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థి దశలో జరిగే ఎన్నికలను ఎజిఎం సుబ్బారెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు విధిగా ఓటుహక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఎజిఎం మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నాయకత్వం, నాయకుడిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థి దశలోనే తమ నాయకుడి ద్వారా ఏ చిన్న సమస్యనైనా చర్చించి పరిష్కరించుకునే నాయకత్వ లక్షణాలు ఉండటం వల్ల భవిష్యత్తులో కూడా సులువుగా సాధించుకోవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తబస్సుం, ఏవో గోపాల్, కోఆర్డినేటర్ ఇర్ఫాద్, డీన్‌లు సిరాజుద్దీన్, అప్పలనాయుడు, పిఇటిలు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

వజ్రకరూరు : ఎనికల ముందు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం రూ.20వేలను వెంటనే అందించాలని పిసిసి సభ్యులు వడ్ల ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి సోనియా శీనా డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. ఖరీఫ్ సీజన్ అదును దాటుతున్న సరైన వర్షాలు లేక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అదును దాటిపోతున్న నేపథ్యంలో వందశాతం సబ్సిడీతో కందులు, ఉలువలు, అలుసందులు, పెసలు, జొన్నలు, సజ్జలు తదితర విత్తనాలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఓబులేసు, సుధాకర్, సుహెబూబ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

అనంతపురం : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ కోరారు. న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కోర్టు నుంచి నగర ప్రధాన వీధుల్లో హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కోర్టు ఆవరణలో ర్యాలీని ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విధిగా హెల్మెట్ వాడడం వల్ల ఆయా కుటుంబాలకు ఎంతో శ్రేయస్కరమని తెలిపారు. టవర్ క్లాక్ సప్తగిరి సర్కిల్ ప్రాంతాలలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గురుపసాద్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరినాథ్‌రెడ్డి, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తప్పు చేస్తే.. ఏపార్టీ వారైనా చర్యలు తీసుకోండి

ఎస్పీ, డీఐజీతో ఎంపీ అంబికా, ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

'శాంతి భద్రతల పరిరక్షణకు మా సహకారం ఎప్పుడూ ఉంటుంది.. తప్పుడు చేస్తే ఏ పార్టీ వారైనా చర్యలు తీసుకోండి' అంటూ అనంతపురం ఎంపీ, ఎమ్మెల్యేలు అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతపురం రేంజ్ డిఐజి షిమోషి, ఎస్పీ మురళీకృష్ణను ఎంపీ, ఎమ్మెల్యేలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. అనంతరం జిల్లాలోని పలు అంశాల గురించి చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో ఎప్పుడూ ప్రశాంత వాతావరణం ఉండాలన్నారు. ఇందుకు మా సహకారం ఉంటుందని ఎమ్మెల్యే దగ్గుపాటి అన్నారు. తప్పు ఎవరు చేసినా.. పార్టీలకతీతంగా చర్యలు తీసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి, పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కూచిహరి, జనసేన నాయకుడు అంకే ఈశ్వరయ్య, అనంతపురం అర్బన్ నియోజవర్గ పరిశీలకుడు లక్ష్మీనారాయణ, వడ్డెర సాధికార కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు వడ్డే వెంకట్, టిఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్‌లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

అనంతపురం : నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ సౌజన్యంతో నంద్యాలలో నిర్వహించిన రాష్ట్ర జూనియర్ అండర్-19 ఓపెన్, బాలికల చెస్ ఛాంపియన్‌షిప్-2024 ఎంపిక పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు ఛాంపియన్ షిప్‌లో విభాగంలో 151 మంది బాలురు పాల్గొనగా 6.5/7 పాయింట్లతో కుశల్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. అలాగే బాలికల విభాగంలో రాష్ట్రవ్యాప్తంగా 81 మంది క్రీడాకారిణులు పాల్గొనగా 5/6 పాయింట్లతో మూడవ స్థానాన్ని శ్రీహ కైవసం చేసుకుంది. వీరిద్దరూ సెప్టెంబర్‌లో జరగబోయేటువంటి జాతీయస్థాయి జూనియర్ అండర్-19 ఓపెన్, బాలికల చెస్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున ప్రాతినిథ్యం వహించబోతున్నట్లు ఇంటర్నేషనల్ ఆర్బిటర్ అమ్మినేని ఉదయ్‌కుమార్ నాయుడు తెలిపారు. వీరిని ఆల్ అనంతపూర్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు శివకుమార్, గౌరవ ఛైర్మన్ బాలరాజు, తదితరులు అభినందించారు.

5న కెపిఎల్ క్రికెట్‌టోర్నీ ప్రారంభం

కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం చిక్కప్ప ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఆగస్టు 15న కెపిఎల్ క్రికెట్ టోర్నీను ప్రారంభించనున్నట్లు కెపిఎల్ కమిటీ సభ్యులు గోపీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 15, 16, 17, 18వ తేదీల్లో నిర్వహించనున్న ఈ టోర్నీలో 8 జట్లు తలబడుతున్నట్లు తెలిపారు. ఇప్పటికే క్రీడా ప్రాంగణం మైదానంలో ఫ్లడ్ లైట్లు, తదితర పనులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

'ఓబుళాపురం మైనింగ్'పై విచారణ చేపట్టాలి

సిబిఐకి మాజీ ఎమ్మెల్యే 'కాపు' లేఖ

రాయదుర్గం : ఓబుళాపురం మైనింగ్ కంపెనీలో అక్రమాలపై ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్లు, ప్రింట్ మీడియాలో ప్రచురితమైన, ప్రసారమైన కథనాలపై వెంటనే విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి కోరారు. ఈమేరకు శుక్రవారం సిబిఐ డైరెక్టర్‌కు లేఖ పంపారు. ఈ సందర్భంగా రాయదుర్గంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో సిబిఐ అధికారులు మైనింగ్ కంపెనీని సీజ్ చేశారన్నారు. అప్పట్లో మెటీరియల్‌ను కూడా సీజ్ చేశారన్నారు. ఆ మెటీరియల్ ఎక్కడికి వెళ్లిందో విచారణ చేపట్టాలన్నారు. నిజంగా అక్కడ చోరీ జరిగిందా? జరిగితే ఎవరు చేశారు? సమీపంలో ఉన్న ఉక్కు పరిశ్రమలకు విక్రయించారా? అనే విషయాలపై సిబిఐ విచారణ చేపట్టాలని సిబిఐ డైరెక్టర్‌ను కోరారు. లేఖతోపాటు టీవీ ఛానళ్లు, పత్రికల కథనాలు, యూట్యూబ్ ఛానళ్ల లింకులను జతపరిచామన్నారు. ప్రసారాల్లో సిబిఐనే దొంగలు మేనేజ్ చేసినట్లు కూడా ఆరోపించారన్నారు. అది కూడా వాస్తవమా కాదా అని దర్యాప్తులో తేల్చాలన్నారు. ఒకవేళ మెటీరియల్ చోరీ కాలేదంటే కథనాలు ప్రచురించిన, ప్రసారం చేసిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ఛానళ్ల పత్రికలు విలేకరులకు నోటీసులు ఇచ్చి వివరణ కోరాలన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు : డీఎస్పీ


విద్యార్థినులతో మాట్లాడుతున్న డీఎస్పీ

రాయదుర్గం : విద్యార్థులు, యువత మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు బానిస కారాదని కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం రాయదుర్గంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నిర్మూలన, అవగాహన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలంటే ఉన్నత చదువులు చదువుకోవాలన్నారు. అంతేగానీ బీడీలు, సిగరెట్లు, గుట్కాలు, పాన్ పరాగ్‌లు మొదలైన వాటికి మాదకద్రవ్యాలకు బానిసలు కారాదన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ప్రోగ్రాం ఆఫీసర్లు డి.శ్రీనివాసులు, ఎ.ఎర్రన్న, కళాశాల ప్రిన్సిపాల్ కె.వీరేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభిమానంతో రాజకీయ పయనం

అనతి కాలంలో టిడిపి నాయకురాలిగా సంఘ తేజస్వినికి గుర్తింపు


చంద్రబాబుతో సంగా తేజస్విని

ప్రజాశక్తి అనంతపురం

అనంతపురం జిల్లాకు చెందిన సంఘ తేజస్విని బిసి మహిళగా చిన్న వయసులోనే రాజకీయాల్లో ముందుకు సాగుతూ తన ప్రత్యేకతను చాటుకుంటోంది. తెలుగుదేశం పార్టీపై మక్కువతో ఆ పార్టీలో చేరి తనవంతు ప్రజాసేవకు సిద్ధమైంది. వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన ఆమె అనతి కాలంలో రాజకీయాల్లో గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఆమె తెలుగుదేశం పార్టీ రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానం, భవిష్యత్తుపై పలు విషయాలను ఆమె మాటల్లో ప్రజాశక్తితో పంచుకున్నారు. చంద్రబాబు నాయుడు పిలుపుతో 2015 టిడిపిలో చేరారు. 2016లో అనంతపురం జిల్లా వాల్మీకి సేవాదళ్ మహిళా విభాగం అధ్యక్షురాలుగా నియమితులయ్యారు. 2017 నుంచి 2018 వరకు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. 2019 సార్వత్రిక ఎన్నికల్లో అనంతరం అర్బన్ తెలుగుదేశం అభ్యర్థి గెలుపుకోసం విస్తృత ప్రచారం చేశారు. అమరావతి బస్సుయాత్రలో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో చంద్రబాబు నాయుడు వెంట పర్యటించారు. లాక్‌డౌన్ సమయంలో అనంతపురం అర్బన్ 42వ డివిజన్‌లో సుమారు 2000 ఇళ్లకు నిత్యావసర వస్తువులను అందించారు. 2019 ఎన్నికల్లో వైసిపి అధికారంలో రావడంతో ఆ పార్టీ నేతల నుంచి వేధింపులకు గురైంది. సోషల్ మీడియా వేదికగా ఇబ్బందులకు గురి చేశారు. వైసిపి నాయకులు నారా భువనేశ్వరిపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ తెలుగు మహిళలతో కలసి కొడాలి నాని, అంబటి రాంబాబు వల్లభనేని వంశీలను విమర్శించారు. దీంతో ఆమెపై పోలీసులు కేసులు నమోదు చేశారు. రాజకీయంగా టిడిపి తరపున స్వరం విన్పిస్తున్నారన్న నేపథ్యంలో వైసిపికి చెందిన కొందరు సామాజిక మాధ్యమాల ద్వారా అసభ్యకర పోస్టింగ్‌లు చేశారు. చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ టిడిపి ఆధ్వర్యంలో 53 రోజుల పాటు చేపట్టిన సుధీర్ఘంగా పోరాటాల్లో భాగస్వామి అయ్యారు. ఈ సమయంలో ఆమెపై అనంతపురం పరిధిలో రెండు అక్రమ కేసులు నమోదు అయ్యాయి. రాజకీయాలతో సంబంధం లేని ఆమె భర్త సంఘ పవన్ కుమార్‌పైన పోలీసు కేసులు నమోదు అయ్యాయి. ఆర్థిక మూలాలను దెబ్బతీసే చర్యలతోనూ నష్టం కలిగించారు. ఇంతకాలం క్రమశిక్షణతో పార్టీ కోసం పనిచేసిన తమకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ నామినేట్ పదవుల్లో సుమచిత స్థానం కల్పిస్తారని సంఘ తేజస్విని ఆశాభావం వ్యకం చేస్తున్నారు. భవిష్యత్తులోనూ పార్టీ కోసం మరింత అంకిత భావంతో పని చేస్తామని ఆమె తెలియజేశారు.


ప్రజలతో తెలుగు మహిళా రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న వైద్యాధికారులు

వజ్రకరూరు : సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరికీ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ వైద్యాధికారిణి తేజస్వి సూచించారు. శుక్రవారం వజ్రకరూరు మండలంలోని కమలపాడు ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ముఖ్యంగా చికున్‌గున్యా, డెంగీ, మలేరియా ఇతర కీటక జనిత వ్యాధులు నియంత్రణ తదితర విషయాలపై విద్యార్థులకు వివరించారు. పరిసరాల పరిశుభ్రత వ్యక్తిగత పరిశుభ్రత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది రాము, నటరాజ్ గౌడ్, ఏఎన్ఎం ఉషా మౌనిక, ఎంఎల్‌హెచ్‌పి సుధామదారి, లక్ష్మికాంతమ్మ, ఆశా కార్యకర్తలు గౌతమి, మంగమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అకడమిక్ క్యాలెండర్ విడుదల చేయాలి

అనంతపురం క్రైం : రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అకడమిక్ క్యాలెండర్‌ను విడుదల చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాస్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన టోఫెల్ బోధన ఎవరు బోధిస్తారు, తెలుగు మీడియం కొనసాగిస్తారా.. లేదా.. 117 జీవో రద్దుపై ప్రభుత్వ వైఖరి, గత ప్రభుత్వం కొత్తగా ఏర్పరిచిన కో ఎడ్యుకేషన్ హైస్కూల్ ప్లస్ పాఠశాలల్లో అధ్యాపకుల నియామకంపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. అదేవిధంగా ఈ సంవత్సరం జనవరి నుంచి పదవీ విరమణ, ఇతర కారణాల ద్వారా ఏర్పడిన ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. అలాగే అర్హులకు ఉద్యోన్నతులు కల్పించాలన్నారు. ఇతర శాఖల మాదిరి కాకుండా పాఠశాల విద్యాశాఖలో నిరంతర పర్యవేక్షణ అవసరమని,విద్యార్థుల సంక్షేమం కోసం సత్వర నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

భారీ వర్షాల నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్‌డిఒ రాణిసుస్మిత సూచించారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో మండలంలోని తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్, తదితర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లాలో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈనేపథ్యంలో గ్రామస్థాయి అధికారులు లోతట్టు ప్రాంతాలు, పాక్షికంగా దెబ్బతిన్న పాఠశాలల భవనాలు, పూరి గుడిసెలను గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా వంకలు, వాగులు తదితర ప్రమాద స్థలాలను గుర్తించి హెచ్చరికలు జారీ చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, ఇరిగేషన్, మండల పరిషత్, వ్యవసాయ తదితర శాఖల అధికారులు గ్రామస్థాయిలో పర్యవేక్షించి అన్ని జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఇతర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు పురాతన ఇల్లు దెబ్బతిన్న పాఠశాల భవనాలు కుప్పకూలాయన్నారు. ఈ ఘటనలను గుర్తించిన ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టేందుకు సిద్ధమైందని సూచించారు.

శింగనమల : భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు మండల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ శోభన్‌బాబు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమణ, డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు, సీనియర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

డిఎంహెచ్‌ఒ భ్రమరాంబదేవి

అనంతపురం అర్బన్ : దోమల నివారణకు వెంటనే చర్యలు చేపట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖధికారి డాక్టర్ ఇ.బి.దేవి సంబంధిత అధికారులను సూచించారు. శుక్రవారం అనంతపురంలోని 9వ సచివాలయం పరిధిలో ఉన్న నీరుగంటి వీధిలో చేపట్టిన ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని డిఎంహెచ్‌ఒ తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి నీరు నిలువ ఉంచుకునే అన్ని రకాల కంటైనర్లను పరిశీలించారు. ప్రజలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా మలేరియా, డెంగీ నివారణ కోసం మలేరియా సిబ్బంది పనిచేసేలా చూడాలని మలేరియా అధికారి ఓబులును ఆదేశించారు. అలాగే పట్టణ పరిధిలోని అన్ని సచివాలయాల పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ విష్ణుమూర్తి, సబ్ యూనిట్ అధికారి, సూపర్‌వైజర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య, సూపర్‌వైజర్లు నూర్‌బాషా, శ్రీధర్, ఆరోగ్య కార్యదర్శి లక్ష్మీదేవి, మలేరియా అసిస్టెంట్ శంకరయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న డిఎంహెచ్‌ఒ, వైద్య సిబ్బంది

టిడిపి నాయకుడు మృతి

గుత్తి : టిడిపి సీనియర్ నాయకుడు పుష్పరాజ్ పాల్ (69) శుక్రవారం మృతిచెందాడు. ఆయన కొంతకాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. ఆరోగ్య పరిస్థితి విషమించి మరణించాడు. దీంతో టిడిపి ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు దిల్కాశీనా, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మోడే శ్రీనివాసయాదవ్, తదితరులు పుష్పరాజ్ పాల్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బి.కుమార్, టిడిపి నాయకులు చాకలి శ్రీనివాసులు, ఇస్మాయిల్, కుళ్లాయి, గార్మెంట్స్ జాఫర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుడు ....



నార్పల : మండల కేంద్రానికి చెందిన పంచాయతీ కార్మికుడు పోలప్ప అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. పోలప్ప ఎన్నో ఏళ్లుగా పంచాయతీ కార్యాలయంలో సీనియర్ స్లీపర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. పోలప్ప మృతి విషయం తెలుసుకున్న పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఇంటికెళ్లి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారుడు ప్రభుదాస్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.